@netifocusnews @focustv
http://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || గురువారం 05, సెప్టెంబర్ 2024 || పేజీలు: 04

# నాణ్యమైన విద్యుత్ అందుబాటులో

## కార్యాచరణ సిద్ధం చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి





హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-సెప్టెంబర్ 04:

రాబోయే రోజుల్లో ఒక బిజినెస్ హబ్‌గా మారబోతున్న తెలంగాణలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన విద్యుత్ అందుబాటులో ఉండేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గారితో కలిసి విద్యుత్ శాఖపై ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. రాష్ట్రంలో విద్యుత్ రంగం, ప్రజల అవసరాలకు అనుగుణంగా తీసుకోవలసిన చర్యలపై పలు సూచనలు చేశారు.రాష్ట్రంలో డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి చేసేందుకు వీలుగా మిగతా 2లో..



## వానాకాలం అయిపోతున్నా..

# రైతుబంధేది?

### ఊపిరి ఉన్నంత వరకు సిద్దిపేట అభివృద్ధి కోసం కృషిచేస్తా

- ప్రతిపక్షాలపై దాడులు, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం
- వరద బాధితులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీల నెల జీతం విరాళం
- సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)-సెప్టెంబర్ 04:

ముఖ్యమంత్రి రేవంత్ వద్ద వ్యంగం తప్ప పరిపాలన వ్యవహారం లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఊపిరి ఉన్నంతవరకు సిద్దిపేట అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. సిద్దిపేటను ఓర్వలేక ఇక్కడి అభివృద్ధి పనులు అడ్డుకుంటున్నారని.. అసెంబ్లీలో కొట్లాడి సిద్దిపేట అభివృద్ధిని కొనసాగిస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పక్షాల మీద దాడులు, కక్ష సాధింపులకు పాల్పడుతుందని.. హామీల అమలు లేదు.. పరిపాలనపై పట్టింపు లేదని మండిపడ్డారు. అరచేతిలో వైకుంఠం చూపించి.. అధికారంలోకి రాగానే పాలనను కాంగ్రెస్ ఆగం చేస్తుందని విమర్శించారు.ఆపదలో పార్టీ పక్షాన ఆదుకునేందుకు వెళ్తే ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ పార్టీ దాడులకు పాల్పడిందని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. పాలు, నీళ్లు ప్రజలే తేలుస్తారన్నారు. రైతు రుణ మాఫీ సగం చేసి చేతి ముడుచుకున్నాడని.. వానాకాలం ఐపోతున్నా రైతుబంధు లేదన్నారు. మిగతా 2లో..



# మెరుగైన వైద్యం అందించాలి

- దోషులను కఠినంగా శిక్షిస్తాం
- చికిత్స పొందుతున్న మహిళను పరామర్శ
- మంత్రి సీతక్క

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-సెప్టెంబర్ 04:

ఆసిఫాబాద్ జిల్లాలో ఆటో డ్రైవర్ దాడిలో తీవ్రంగా గాయపడి గాంధీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మహిళను మంత్రి సీతక్క పరామర్శించారు. బాధితురాలికి అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. హాస్పిటల్ నుంచే జిల్లా ఎస్పీతో మాట్లాడారు. నిందితుడిపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితురాలి కుటుంబానికి అండగా ఉంటామని హామీనిచ్చారు. నిందితులు ఎంతటి వారైనా వదిలి పెట్టేది లేదని స్పష్టం మిగతా 2లో..

## జెట్ స్పీడ్‌లో విద్యుత్తు పునరుద్ధరణ

# పనులు చేపట్టాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-సెప్టెంబర్ 04:

వర్షాలు, వరదల నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన విద్యుత్తు పునరుద్ధరణ పనులు చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయంలో విద్యుత్తుశాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఏ సమస్య వచ్చినా డిస్కం సీఎండీల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమీక్షలో ఇంధనశాఖ కార్యదర్శి రోనాల్డ్‌రోస్, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, ఓఎస్డీ సురేందర్‌రెడ్డి, సింగరేణి సంస్థ సీఎండీ బలరాంనాయక్ పాల్గొన్నారు.



## ఐదు రోజులు

# అతి భారీ వర్షాలు

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-సెప్టెంబర్ 04:

తెలంగాణలో వర్షాలు దంచికొడుతు న్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా వరదలు పోటెత్తాయి. చెరువులు జలకళను సంతరించుకోగా.. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షాలకు సంభవించిన వరదలతో ఖమ్మం సహా పలుచోట్ల ప్రజలు మిగతా 2లో..





# వరద బాధితులకు నా వంతు సాయం

- తెలంగాణకు రూ.1కోటి విరాళం
- ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)-సెప్టెంబర్ 04:

తెలంగాణలో వరద బాధితుల సహాయార్థం ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రూ.1 కోటి విరాళం ప్రకటించారు. ఈ మేరకు తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్స్‌కు కోటి రూపాయలు ఇస్తానన్నారు. అలాగే ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్స్‌కు రూ.1 కోటి ఇస్తానని ప్రకటించారు. అలాగే ఏపీలోని 400 పంచాయతీలకు రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.4 కోట్లు మిగతా 2లో..





# భారీ పెట్టుబడులకు ప్రయత్నిస్తా

- ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, (నేటి ఫోకస్ న్యూస్)-సెప్టెంబర్ 04:

భారతదేశం ఎల్లవేళలా సముచిత, ఆదర్శనీయ పెట్టుబడుల విడిది అవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మిత్రదేశం సింగపూర్‌లో రెండు రోజుల పర్యటనకు ప్రధాని మోడీ బుధవారం ఇక్కడికి వచ్చారు. ఇండియా సింగపూర్ వ్యూహాత్మక భాగస్వామ్యం, స్నేహం మరింత ఇనుమడింపచేసుకునేందుకు మోడీ ఈ పర్యటన తలపెట్టారు. భౌగోళికంగా అత్యంత కీలకమైన ఈ ఆగ్నేయాసియా దేశం నుంచి భారత్‌కు భారీ పెట్టుబడులను రాబట్టుకునేందుకు ప్రధాని యత్నిస్తారు. మిగతా 2లో..

# షేక్ మగ్దూంకు కఠిన శిక్ష

పడేలా చర్యలు తీసుకోవాలి

- కేంద్ర మంత్రి బండి సంజయ్

2



# దాడులు చేస్తే బాధలు తీరుతాయా!

- సహాయక చర్యల్లో అట్టర్ ఫ్లాప్ అయ్యారు
- హైడ్రాను మంత్రుల ఫంక్షన్ హాళ్లు, విల్లాలతో మొదలుపెట్టండి
- ఇంచు నేను ఆక్రమణలు ఉన్నా కూల్చివెయ్యి
- రిటైనింగ్ వాల్ ఎందుకు కట్టడం లేదో ప్రభుత్వం చెప్పాలి
- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్




హైదరాబాద్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)–సెప్టెంబర్ 04: వరద వస్తుందని ఖమ్మం ప్రజలకు ముందు చెప్పలేదు. ఇదే ప్రభుత్వ ఫెయిల్యూర్ అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలియజేశారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించారు. సందర్భంగా పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు వెళ్తే మాపైన దాడి చేశారు. మున్నేరు పరీవాహకంలో రాజీవ్ గృహకల్ప, జలగం నగర్ కాలనీలు కట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని మున్నేరుకు రెండు వైపులా రిటైనింగ్ వాల్ కావాలని రూ. 650 కోట్లు మంజూరు చేయించాను ఖమ్మం జిల్లాలో ఉన్న మంత్రులకు వాయిస్ లేదు అని ఖమ్మం జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు ఫెయిల్ అయ్యారని ప్రజలు భావిస్తున్నారు మున్నేరుకు వరద ఎక్కడి నుండి వస్తుందో రేవంత్ రెడ్డికి తెలుసా అని అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి అవగాహన లేకుండా మహబూబాబాద్ వెళ్లి నాపై దాడి చేసే ప్రయత్నం చేశారు. అజయ్ కుమార్ ఆక్రమణల వలనే ఖమ్మం మునిగిందని రేవంత్ రెడ్డి అన్నారు. మున్నేరుకు రెండున్నర లక్షల క్యూసెక్కుల నీరు వచ్చింది ఆదివారం ఉదయం నాటికి 33 అడుగులు నీరు వచ్చింది ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలం అయింది ఎన్నికల ప్రచారానికి వచ్చినట్లు రేవంత్ రెడ్డి వ్యవహరించారు. మేము అధికారంలో ఉన్నప్పుడు ఎట్లా పని చేశామో ప్రజలకు తెలుసు అని అని వెల్లడించారు. ఖమ్మం నగరంలో ఒక్క ఇంచు నేను ఆక్రమణలు ఉన్నా కూల్చివెయ్యి నా హాస్పిటల్ కట్టి 25 సంవత్సరాలు అయింది నా హాస్పిటల్‌కు చుక్క నీరు రాలేదు నా హాస్పిటల్‌కు మున్నేరుకు సంబంధం లేదు. కేసీఆర్ వరద సహాయం చేస్తే నువ్వు సీఎం పదవిలో ఉండి ఎందుకు ప్రజలను డైవర్ట్ చేసేందుకు నిన్న మాపై దాడులు చేశారు. ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు ప్రజల ప్రాణాలను ప్రజలే కాపాడుకున్నారు. రిటైనింగ్ వాల్ ఎందుకు కట్టడం లేదో ప్రభుత్వం చెప్పాలి. భౌతికంగా మాపై దాడి చేస్తే ఖమ్మం ప్రజల భాదలు తీరుతాయా మంత్రుల ఫంక్షన్ హాల్స్ ఆక్రమణలో ఉన్నాయని ఖమ్మం ప్రజలు అనుకుంటున్నారు. రెవెన్యూ మంత్రి కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. మరో మంత్రి విల్లాలు వక్ఫ్ బోర్డు భూముల్లో ఉన్నాయి. ప్రజలు తమ ఇళ్లకు వెళ్లి 36 గంటలు అయింది. మున్నేరుకు శాశ్వత పరిష్కారం ప్రభుత్వం చూపాలి. కాంగ్రెస్ నేతలు మాపై దాడులు చేశారు. హైడ్రాను మంత్రుల ఫంక్షన్ హాళ్లు, విల్లాలతో మొదలుపెట్టండిదాడి చేసిన వారి పేర్లతో సహా సీపీకి ఫిర్యాదు చేశాం ఖమ్మంలో తుమ్మల నాగేశ్వరరావు మనుషులే మాపై దాడి చేశారు అని అన్నారు.

# వరద బాధితులకు నా వంతు సాయం

(మొదటి పేజీ తరువాయి..)

ఆర్థిక సాయం చేస్తున్నట్లు ప్రకటించారు. వరద బాధితులకు మొత్తంగా రూ.6 కోట్లు ఇస్తున్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే.

**హైడ్రాతో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నది కరెక్టే..**

ఇటీవల కాలంలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు హైడ్రా. హైదరాబాదులో అక్రమ నిర్మాణాల అంతు తేల్చుతున్న ఈ వ్యవస్థ, కబ్జాదారుల పాలిట సింహస్వప్నంలా మారింది. తాజాగా, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విజయవాడ వరదలకు కారణమైన బుడమేరు గురించి మాట్లాడుతూ హైడ్రా ప్రస్తావన తీసుకువచ్చారు. "బుడమేరు పరీవాహక ప్రాంతం అంతా ఇళ్లు కట్టేశారు. ఈ విషయంలో సంబంధింత యంత్రాంగానికి, మున్సిపాలిటీకి, పంచాయతీలకు రెస్పాన్సిబిలిటీ ఉంది. హైడ్రా వంటి వ్యవస్థను తీసుకువచ్చి వీటన్నింటినీ తొలగించవచ్చు. కానీ కొన్ని సమస్యలు వస్తాయి. హైదరాబాద్ లో చెరువులు, నదీ పరీవాహక ప్రాంతాల్లో ఇళ్లు కట్టడం చూశాను. ఇబ్బందులు రావా అనుకునేవాడ్ని! అన్నీ కట్టేసిన తర్వాత కూల్చేయడం కాదు... ఇలాంటి వాటిని ముందే నివారించేలా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా అధికారులు వాళ్ల బాధ్యతను వాళ్లు నిర్వర్తించాలి. ఇప్పుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చాక అక్రమ నిర్మాణాలను కూలగొట్టేస్తామంటున్నారు. ఆయన చేస్తున్నది రైటే. అయితే మనం కూడా ఇలాగే వ్యవహరించాలంటే... అనేక సామాజిక సమస్యలు, సామాజిక ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉంది. దీని గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది" అని పవన్ కల్యాణ్ వివరించారు.

# వానాకాలం ఐపోతున్నా రైతుబంధేది?

(మొదటి పేజీ తరువాయి..)



అవ్వాతాతలకు, వికలాంగులకు పెన్షన్ ఇవ్వక కాంగ్రెస్ ప్రభుత్వం ఆగం చేస్తుందని మండిపడ్డారు. ప్రజలు కష్టాల్లో, ఆపదల్లో ప్రైవేట్ హాస్పిటల్లో ఖరీదైన వైద్యం పొందితే కొంత మొత్తాన్ని ఉడతాభక్తిగా సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం చేసేవాళ్లమని.. ఇందుకు తమ వంతు కృషి చేసిన స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, కేసీఆర్ నాయకత్వంలో సిద్ధిపేటను తెలంగాణాలోనే బెస్ట్ నియోజకవర్గంగా అందరి సహకారంతో అభివృద్ధి చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 9నెలల కాలంలో అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని.. కేసీఆర్ ఆశీర్వాదంతో రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా సిద్ధిపేట తీర్చిదిద్దుకున్నామన్నారు.

**వరద బాధితులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీల నెల జీతం విరాళం..**

కురుస్తున్న వర్షాలకు జన జీవనం స్తంభించిపోయింది. భారీ వర్షాలకు పలు చోట్ల చెట్లు, కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. పంటలు దెబ్బతిన్నాయి. ఈ వరదలకు అనేక మంది ప్రజలు ఇళ్లను కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఈ క్రమంలో వరద బాధితులను ఆదుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ ఎంపీలు ఎమ్మెల్యేలు ముందుకొచ్చారు. తమ వంతు సాయంగా ముఖ్యమంత్రి సహాయ నిధికి ఒక నెల జీతంవిరాళంగా ప్రకటించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం మేరకు బుధవారం సిద్దిపేటలో మాజీ మంత్రి హరీశ్ రావు విరాళాలను ప్రకటించారు. కాగా, ఖమ్మం జిల్లాలో వరద బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే.

**విధుల నుంచి తొలగించడం దుర్మార్గమైన చర్య..**

సోషల్ వెల్ఫేర్ విద్యాలయాల్లో పనిచేస్తున్న 6,200 మంది పార్ట్‌టైం టీచర్లు, లెక్చరర్లు, డీఈవోలు ను ఏకకాలంలో విధుల నుంచి తొలగించడం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దీన్ని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించరు. ఇదేంటని అడిగినందుకు ఉద్యోగాల నుండి తొలగిస్తారు.. ఇదేనా మీ ప్రజా పాలన? అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఇదేనా మీరు చెప్పిన ఇందిరమ్మ రాజ్యం? అని నిలదీశారు. విద్యా సంవత్సరం మధ్యలో టీచర్లను తొలగించి వారి కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఐదు రోజులు అతి భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి..)

తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా వర్షాలపై వాతావరణశాఖ మరో కీలక అప్‌డేట్‌ను అందించింది. రాబోయే ఐదురోజుల పాటు పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. యానం, ఉత్తరాంధ్ర పరిసరాల్లో కొనసాగుతున్న అల్పపీడనం సముద్రమట్టానికి సగటున 3.1 నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉందని.. ఎత్తుకువెళ్లే కొలది నైరుతి దిశలో వంగి ఉందని పేర్కొంది. గురువారం వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ఈ క్రమంలో రాగల ఐదురోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని.. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఆరెంజ్, మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. గురువారం భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అతిభారీ వర్షాలు.. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడుతాయని చెప్పింది.



# మెరుగైన వైద్యం అందించాలి

(మొదటి పేజీ తరువాయి..)

చేశారు.దాడి ఘటన వెలుగులోకి రాగానే నిందితుడిని అరెస్టు చేసాం. నిందితుడికి కఠిన శిక్ష పడేలా ఇప్పటికే చర్యలు చేపట్టామన్నారు. జైనూరు ఆదివాసీ యువత సంయమనంతో ఉండాలని కోరారు. ఆందోళన అవసరం లేదు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామని భరోసానిచ్చారు. కాగా, ఆటో డ్రైవర్ దాడిలో మహిళ గాయపడటంపై జైనూర్‌లో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. జైనురు మండల కేంద్రంలో పలు దుకాణాల సముదాయాలకు నిప్పు పెట్టారు. వాహనాలను సైతం తగలబెట్టారు.

**తల్లుల దీవెనలతోనే బయటపడ్డాం..**

ములుగు అటవీ ప్రాంతంలో 500 ఎకరాల్లో చెట్లు నేలకూలడంపై మంత్రి సీతక్క విస్మయం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితమే చెట్లు నెలకొరిగిన ప్రాంతాన్ని సందర్శించినప్పటికి ఈ స్థాయిలో లక్ష చెట్ల వరకు కూలిపోయాయని ఊహించలేదన్నారు. జరిగిన నష్టాన్ని డ్రోన్ కెమెరాల సహాయంతో అంచనా వేసే క్రమంలో జరిగిన విధ్వంసం బయటపడిందన్నారు. ఘటనపై బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి పీసీసీఎఫ్, డీఎఫ్ఓ, స్థానిక అధికారులతో మంత్రి టెలిఫోన్లో మాట్లాడారు. 500 ఎకరాల్లో అటవీ సంపద నేల కూలిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేల సంఖ్యలో భారీ వృక్షాలు నేల కూలడంపై సమగ్ర విచారణకు ఆదేశించారు.

# షేక్ మగ్దూంకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలి

**– కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్**

హైదరాబాద్, (నేటి ఫోకస్ న్యూస్)–సెప్టెంబర్ 04: ఆదిలాబాద్ జిల్లా జైనూర్ మండలం దేవుగూడకు చెందిన ఆదివాసీ మహిళ (45)పై గత నెల 31న ఆటోడ్రైవర్ షేక్ మగ్దూం లైంగిక దాడికి యత్నించిన ఘటనపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలంగాణ రాష్ట్ర డిజిపిని ఆరా తీశారు. కేంద్రమంత్రి బుధవారం డిజిపి జితేందర్‌కి ఫోన్ చేసి ఈ సంఘటనపై ఆరా తీశారు. గత నెల 31న ఘటన జరిగితే ఇంత ఆలస్యంగా వెలుగులోకి రావడానికి గల కారణాలపై డిజిపిని అడిగి తెలుసుకున్నారు. జైనూర్‌లో తలెత్తిన ఉద్రిక్తత పరిస్థితులకు ఉన్న కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆదివాసీ మహిళ కేసు పూర్వాపరాలను, ఘటన జరిగిన వెంటనే చర్యలు తీసుకోకపోవడానికి కారణాల ఏమిటని అడిగారు. ఆదివాసీ మహిళపై లైంగిక దాడికి యత్నించడమే కాకుండా విచక్షణారహితంగా దాడి చేసి రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లుగా చిత్రీకరించేందుకు కుట్ర చేసిన నిందితుడు షేక్ మగ్దూంకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి సంజయ్ డిజిపిని కోరారు. మహిళలపై హత్య, అత్యాచారాలకు పాల్పడే వారు ఎంతటివారైనా కఠిన శిక్షలు తప్పవనే సంకేతాలు పంపాలని సూచించారు. అదే సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఆదివాసీ హక్కులకు భంగం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



- ప్రతిఒక్క బాధితుడికి ప్రభుత్వం అండగా ఉంటుంది
- రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఇంటింటికి వెళ్లి క్షేత్రస్థాయిలో నష్టం అంచనా చేయాలి
- ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య




తొలిక్రాంతి న్యూస్, (నేటి ఫోకస్ న్యూస్)–సెప్టెంబర్ 04: ఇల్లందు పట్టణంలోని నెంబర్ 2 బస్తీ, స్టేషన్ బస్తి వరదముంపునకు గురైన ప్రాంతాల్లో బుధవారం ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ డీవీ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోచికొండ శ్రీదేవి, సీఐ బత్తుల సత్యనారాయణ, ఎమ్మార్వో రవికుమార్లు విస్తృతంగా పర్యటించారు. ఈ మేరకు ప్రతిఇంటికి తిరిగి వరద బాధితులు అధైర్య పడుద్దని ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. వరద నష్టాన్ని పరిశీలించి ఇండ్లు, వస్తువులు, షాపులు, పంటపొలాలు నష్టపోయిన ప్రతిఒక్క బాధితుడికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. రెవిన్యూ అధికారులను ఇంటింటికి వెళ్లి క్షేత్రస్థాయిలో నష్టం వంచన చేయాలన్నారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని అధికారులతో పారిశుద్ధ్య పనులు అంటువ్యాధులు ప్రబలకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మున్సిపల్ డిఈ మురళి, మున్సిపల్ ఏఈ కుమారస్వామి, మున్సిపల్ మేనేజర్ అంకుశావలి, కౌన్సిలర్ మొగిలిలక్ష్మి, టౌన్ ప్రెసిడెంట్ దొడ్డ డానియల్, మహిళా అధ్యక్షురాలు స్వరూప, మడుగు సాంబమూర్తి, బొల్లా సూర్యం, చిల్ల శ్రీనివాసరావు, చిల్ల విజయభారతి, జాఫర్, యూత్ లక్ష్మణ్, ఉల్లింగ సతీష్, పింగిలి నరేష్, ఆఫ్రిద్, పెద్దినేని హరిబాబు, గోచికొండ శ్రీదేవి, సునీత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్ అందుబాటులో..

(మొదటి పేజీ తరువాయి..)

సోలార్ విద్యుత్ ఉత్పత్తి, వినియోగం పెరిగేలా చర్యలు.వివిధ శాఖల పరిధిలో నిరుపయోగంగా ఉన్న భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి.సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించడానికి రైతులకు ఉచితంగా సోలార్ పంప్‌సెట్లు. అందుకు కొండారెడ్డిపల్లెలో పైలట్ ప్రాజెక్టు. వంటగ్యాస్ బదులుగా సోలార్ విద్యుత్ వినియోగ విధానం. మహిళా సంఘాలకు శిక్షణ. అటవీ భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి చర్యలు. ప్రతీ ఏటా 40వేల మెగావాట్స్ విద్యుత్ అందుబాటులో ఉండే విధంగా కార్యాచరణ. ఓవర్ లోడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడం.



# భారీ పెట్టుబడులకు ప్రయత్నిస్తా

(మొదటి పేజీ తరువాయి..)

సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ ఆహ్వానం మేరకు సింగపూర్‌లో పర్యటించే ప్రధాని మోదీ పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. సింగపూర్‌లోని మూడు తరాల నాయకత్వ శ్రేణులతో ముచ్చటిస్తారని భారత అధికార వర్గాలు తెలిపాయి. సింగపూర్‌కు తన ఆగమనాన్ని ప్రధాని మోడీ సామాజిక మాధ్యమాల్లో ఫోటోతో పాటు పొందుపర్చారు. సింగపూర్‌కు మోడీ వెళ్లడం ఇది ఐదోసారి. భారతదేశంలో సంస్కరణలు, ప్రత్యేకించి యువశక్తి ప్రతిభాపాటవాలు , అపార మానవ వనరులు వంటివి భారత్‌ను సర్వదా పెట్టుబడుల కేంద్రం చేస్తున్నాయని మోడీ తెలియచేసుకున్నారు. ఇరు దేశాల మధ్య విస్తృత సాంస్కృతిక సంబంధాలను ఆశిస్తున్నట్లు వివరించారు. బ్రూనేలో తమ అధికారిక పర్యటనను ముగించుకుని, అక్కడి నుంచి మోడీ సింగపూర్‌లో వాలారు. లయన్ సిటీ సింగపూర్‌కు చేరిన ప్రధానికి అక్కడి హోం , న్యాయ వ్యవహారాల మంత్రి కె షణ్ముగం సాదర స్వాగతం పలికారు. ఇక్కడ ప్రధాని మోడీ ఉత్తేజభరిత కార్యాచరణ స్థాయి చర్చల అజెండా ఖరారు అయిందని ప్రధాన మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇక ప్రధాని మోడీకి గురువారం పార్లమెంట్ ఆవరణలో అధికారిక స్వాగతం పలుకుతారు. తరువాత ఆయన దేశాధ్యక్షులు థర్మన్ శణ్ముగరత్నంను కలుసుకుంటారు. వీరి మధ్య చర్చలు జరుగుతాయి. గతంలో ప్రధాని మోడీ 2018లో సింగపూర్‌కు వెళ్లారు. ఇప్పుడు ప్రధాని వెంట విదేశాంగ మంత్రి జై శంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. సింగపూర్‌కు చెందిన సీనియర్ రాజకీయ నాయకులు లూంగ్, గో ఛోక్ టాంగ్‌ను కూడా ప్రధాని కలుస్తారు. మోడీ పర్యటన దశలో సెమీకండక్టరు రంగంలో మానవ వనరుల నైపుణ్యాభివృద్ధికి సంబంధించి ఎంఒయులపై సంతకాలు జరుగుతాయని విదేశాంగ శాఖ తెలిపింది. సింగపూర్‌కు చెందిన సంస్థల ద్వారా భారతీయ యువతకు సరైన నైపుణ్యం కల్పించడం, వారికి రిక్రూట్‌మెంట్లు ఉండటం వల్ల ఇకపై భారతీయ యువతరానికి సింగపూర్ ప్రధాన అవకాశాల వేదిక అవుతుందని ఆశాభావం వ్యక్తం అయింది.



# డల్లాస్ అన్నారు..!! కల్లాస్ చేశారు..!!

- ప్రభుత్వాన్ని బద్నాం చేసే వైఖరి మానుకోవాలి...!
- త్వరలో కబ్జాకోర్ల బండారం బయటపెడతాం....!
- సమన్వయకర్త లక్కాకుల సతీష్ కుమార్.



**వనపర్తి ప్రతినిధి, నేటి ఫోకస్ న్యూస్:**

హైదరాబాద్ మహానగరాన్ని డల్లాస్ చేస్తానని, బిఆర్ఎస్ నాయకులు ప్రజలను నమ్మించి కల్లాస్ చేశారని నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్ కుమార్ ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నంది హిల్స్ లో గల ఎమ్మెల్యే నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరదల కారణంగా మృతి చెందిన మృతదేహాలతో కూడా రాజకీయం చేయడం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డికి చెల్లిందని విమర్శించారు. విపత్తు అంటేనే చెప్పి రాదని, అలాంటప్పుడు కేవలం ప్రభుత్వాన్ని బదనాం చేయాలనే ఉద్దేశంతోనే మాజీ మంత్రి మాట్లాడటం దురదృష్టకరమన్నారు. గతంలో వనపర్తిలో చెరువులను పునరుద్ధరణ పేరుతో భారీ గోతులు చేసింది మీరు కాదా? అని, అలాంటి గోతుల కారణంగా యువకులు నీట మునిగి మరణించినప్పుడు మీరెందుకు హెలికాప్టర్లతో వారిని కాపాడలేకపోయారని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 ఏళ్లు అవుతా ఉన్నా నేటికీ ఇంకా సొంత ఇల్లు లేని వారు, పాత ఇల్లల్లో నివాసం ఉంటున్నారంటే దీనికి కారణం మీ పదేళ్ల పరిపాలననే కారణమన్నారు. వనపర్తిలో వరద సహాయక చర్యల్లో ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాల మేరకు ప్రాణాలకు తెగించి సహాయ చర్యలు చేపట్టామని అన్నారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నీరు నిలిచి ఇబ్బందిగా మారితే నిమిషాల్లో చర్యలు చేపట్టి పరిష్కరించామని తెలిపారు. బలిదానాలతో వచ్చిన తెలంగాణలో గత పదేళ్ల పాటు ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రి వేల ఎకరాల్లో భూముల కబ్జా, వందల ఎకరాల్లో ఫాంహౌసులు నిర్మించుకున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని డల్లాస్ సిటీ చేస్తామన్న బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని కల్లాస్ చేశారని మండిపడ్డారు. విపత్తు ఇంకా ముగియకముందే లెక్కలు అడుగుతున్నారంటే మీ ఆలోచన విధానం ఎంత పని చేస్తుందో మీరే నిర్ణయించుకోవాలని సూచించారు. మీలాగ భూములు కబ్జా చేసే గుణం ఎమ్మెల్యేకు లేదని, వరద సహాయ చర్యల్లో తన సొంత వాహనాలను పెట్టి ప్రజల కోసం పని చేసే గుణం ఎమ్మెల్యే మేఘారెడ్డిదని అన్నారు. త్వరలోనే హైడ్రా తరహాలో జిల్లాలోనూ వడ్రా వస్తుందని అక్రమార్కుల ఆట కట్టించడం, కబ్జాకోర్ల బండారం బయటపడే తరుణం తొందర్లోనే ఉందన్నారు. మాజీ మంత్రిగ్రా మీ అనుభవాలతో సలహాలు ఇవ్వాలే కానీ ప్రభుత్వంపై, ఎమ్మెల్యేలపై బట్టకాల్చి మీదేసే పనులు ఇకనైన మానుకుంటే ప్రజలు హర్షిస్తారని హితవు పలికారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్మన్ మహేష్, కౌన్సిలర్ బాపనిపల్లి వెంకటేష్, జంపన్న యాదవ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సూరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్ఐసీ కృష్ణ, సింగోటం నాయుడు, డి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.






# త్వరలో నియోజకవర్గానికి ఇంజనీరింగ్ కాలేజీ

- పాలిటెక్నిక్ కాలేజ్‌ని సందర్శించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే శ్రీ గణేష్

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ సెప్టెంబర్ 04:**

కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మారేడ్ పల్లిలోని పాలిటెక్నిక్ కళాశాలను ఎమ్మెల్యే శ్రీ గణేష్ సందర్శించారు. కళాశాలలోని అన్ని విభాగాల, హాస్టల్ ను పరిశీలించారు. అనేక సమస్యలను ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, అక్కడి నుండే సంబంధిత అధికారులకు పోన్ చేసి యుద్ధ ప్రాతిపాదికన సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. దాదాపు రెండు గంటలు అక్కడే గడిపిన ఎమ్మెల్యే శ్రీ గణేష్ విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా శ్రీ గణేష్ మాట్లాడుతూ... 18వందల మంది విద్యార్థులకు వృత్తి, విద్యా నైపుణ్య శిక్షణ అందిస్తున్న పాలిటెక్నిక్ కలశాల మన నియోజకవర్గంలో ఉండడం మా అదృష్టమని అన్నారు. అధ్యాపకులు, హెచ్ఓడీ లు, సిబ్బంది విద్యార్థులకు మంచి విద్యను, సదుపాయాలను అందించడం కోసం చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. ముఖ్యమంత్రితో మాట్లాడి పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కళాశాల ప్రాంగణంలోనే ఇంజనీరింగ్ కళాశాలను తీసుకు వస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



- ఓల్డ్ బోయిన్‌పల్లిలో నూతన పాఠశాల ప్రభుత్వ భవనం నిర్మించాలి
- హాస్పిటల్ భవనం నిర్మించాలి: ముద్దం

**ఫోకస్ న్యూస్, ఓల్డ్ బోయిన్పల్లి కంటోన్మెంట్ సెప్టెంబర్ 04:**

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వివిధ డివిజన్ లోని అనేక సమస్యలు ఉన్నాయని వాటిని తక్షణమే పరిష్కరించాలని, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ కు, కార్పొరేటర్లతో కలిసి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవన్ కృష్ణారావు మాట్లాడుతూ... ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ లోని హాస్మంత్ పెట్, అంజయ్య నగర్, ఎల్బీనగర్ ప్రభుత్వ పాఠశాలలకు నూతన భవనాలను నిర్మించి, మంచి సదుపాయం కల్పించి, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడం కోసం సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ మాట్లాడుతూ... యూ.పీ.హెచ్.సి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ హాస్మంత్ పెట్ లో ప్రస్తుతం ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్నామని ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ లో కొత్తగా ఒక ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అర్హులందరికీ రుణమాఫీకై

# కుటుంబ సర్వే

**మండల కాంగ్రెస్, యూత్ అధ్యక్షుడు గనిపల్లి మోహన్**

**మాడుగులపల్లి, సెప్టెంబర్ 4-(నేటి ఫోకస్ న్యూస్)**



తెలంగాణలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వం లోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తుందని మాడ్గులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు గనిపల్లి మోహన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో రుణమాఫీ కానీ రైతులను గుర్తించేందుకు ఇప్పటికే మండల పరిధిలోని చిరుమర్తి, కన్నెకల్, మాడ్గులపల్లి, ఆగామోత్కూర్, గోపాలపురం, చెర్వుపల్లి, గ్రామాలలో వ్యవసాయ అధికారులు రుణమాఫీకి అర్హులైన రైతు కుటుంబాలను గుర్తించేందుకు సర్వే చేయడం జరిగిందన్నారు. మిగిలిన గ్రామాలలో ఈనెల 5 నుండి 24 తారీకు వరకు మండలంలోని అన్ని గ్రామాలలో వ్యవసాయ విస్తరణ ధీకారులు పర్యటించడం జరుగుతుందన్నారు. అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రూ. 2లక్షల రుణ మాఫీ చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. రుణమాఫీ వర్తించని రైతులు అందుబాటులో ఉండి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, జిరాక్స్ పత్రాలను కుటుంబ సర్వే ధ్రువీకరణ ఫారం నింపి అధికారులకు ఇవ్వాలని కోరారు. రుణ మాఫీ వర్తించని రైతుల వివరాలు సేకరించిన అధికారులు సి.ఎల్.డబ్ల్యూ.యాప్ లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా నాలుగు రోజుల కురిసిన భారీ వర్షాల కారణంగా ఎవరైనా చనిపోయిన, ఇల్లు కోల్పోయిన, పంట నష్టపోయిన, పశువులు వరదలు కొట్టుకుపోయి, మరణించిన, తెలంగాణ ప్రభుత్వం ఎక్స్గ్రేషియా ప్రకటించడం జరిగింది. మండలంలో ఇలా ఎవరైనా నష్టపోయిన వాళ్లు ఉంటే బాధితులు ఎమ్మార్వో మరియు కలెక్టర్ కి తెలియజేస్తే ఎక్సగ్రేసియా అందించడం జరుగుతుందన్నారు.




# నూతన సిఐని ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ నేతలు

**(నేటి ఫోకస్ న్యూస్) మెదక్ ప్రతినిధి సిహెచ్ దయానంద రెడ్డి / సెప్టెంబర్ 4:**

రామాయంపేట పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచంద్ర గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం రామాయంపేటకు నూతనంగా వచ్చిన సిఐ ని మరియు ఎస్ఐ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మెదక్ నియోజకవర్గం టిపిసి సేవాదళ్ అధ్యక్షులు మొహమ్మద్ జహీరుద్దీన్, ఓబీసీ సెల్ మెదక్ జిల్లా కన్వీనర్ కె. విప్లవ కుమార్, కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షులు డాకి స్వామి, కోనాపూర్ సొసైటీ డైరెక్టర్ సిద్ధిరాములు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సల్మాన్ రాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బొట్ల బాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యనారాయణ, మరియు తదితరులు పాల్గొన్నారు.



# సియం సహాయనిధి పేదలకు వరం

**– మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్ రెడ్డి**

**మాడ్గులపల్లి, సెప్టెంబర్ : 04 (నేటి ఫోకస్ న్యూస్)**

ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక సాయం పేద ప్రజలకు వరం అని మాడ్గులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడెం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి క్యాంపు కార్యాలయంలో వివిధ కారణాలచే ఇటీవల అనారోగ్యానికి గురైనా పలు ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొంది స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల సహకారంతో ఎమ్మెల్యే బిఎల్ఆర్ ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖా స్తుచేసుకున్న మాడ్గులపల్లి మండల పరిధిలోని13గ్రామ పంచాయతీలకు చెందిన 30మంది లబ్ధిదారులకు ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి సుమారు 12లక్షల 79వేల 5వందల రూపాయలు మంజూరు కావడం జరిగింది. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం వేణు గోపాల్ రెడ్డి స్థానిక నాయకుల తో కలిసి ఆర్థిక సహాయం లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేములపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు రావు ఎల్లారెడ్డి, నాయకులు మునగాల రామచంద్రారెడ్డి, రాఘవరెడ్డి, చింతకాయల సతీష్, యాదయ్య, కట్టా శ్రీనివాస్ రెడ్డి, బొప్పని నగేష్, కర్ర వెంకట్ రెడ్డి, ప్రసాదు, తోట సత్తిరెడ్డి, యాదగిరి, శ్రీనివాసరెడ్డి, మీనారెడ్డి, రవీందర్ రెడ్డి, సీతయ్య, శ్రీనునాయక్, యాదగిరినాయక్, సైదానాయక్, మంచికంటి నాగిరెడ్డి, కల్లూరి వెంకట్ రెడ్డి, పుట్ట రాజయ్య, చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, కిషోర్ గోపాల్ రెడ్డి, దానియల్ తదితరులు పాల్గొన్నారు.

